


ఉదయంనుంచి పడుతున్న వర్షం సాయంత్రమైనా తగ్గు ముఖం పట్ట లేదు. చల్లని ఈదురుగాలి ఉధృతంగా వీస్తోంది. సన్నని జల్లు పడుతూనే ఉంది. ఆలా కూర్చోవడంవల్ల, బద్ధకంగా ఉంటే, ఆ చలి, వర్షంలోనే బయలుదేరాను—గొడుగు పట్టుకొని. రోడ్డుమీద పారుతున్న నీటిలో పాదాలు మునిగిపోయాయి. రోడ్డు ప్రక్క నున్న యింట్లోంచి యిద్దరు పిల్లలు పడవలు తెచ్చి గుమ్మం ముందు నీటిలో వదిలి చోద్యం చూస్తున్నారు.

"శర్మగారూ! ఎవరో పిలిచేసరికి వెనక్కి తిరిగాను.

సైకిలు దిగి "ఉత్తరం వచ్చింది సార్ మీకు—" అంటూ పోస్టుమన్ కవరందించి పోయాడు.

కవరు చింపాను ఆత్రుతగా.

'శ్రీ శర్మగారికి,

ఈ ఉత్తరం చూసి ఆశ్చర్య పోతున్నారు కదూ! అవును. నన్ను మరచి పోయి ఉంటారు. అయిదు సంవత్సరాల వెనక్కిపోయి జ్ఞాపకాల పుటల్ని తిరగేస్తే. వెంటనే గుర్తు కొస్తాను.

ఆనాడు నలుగురిలో-నిండుక్లాసులో మీరునాకు ప్రేమలేఖ వ్రాశారనిఅవమానించిన మూర్ఖురాలిని. నే నానాడు చేసిన ద్రోహం గురుతొచ్చిందా? ఏ ముఖం పెట్టుకొని ఉత్తరం రాశావు మళ్ళీ—అని అడుగుతోంది కదూ మీ మనసు? మీ యిష్టమొచ్చిన శిక్ష విధించండి—అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాను. నేను పాపాత్మురాల్ని శర్మా!

యవ్వనపు పొంగులో, చదువుకొనే రోజుల్లో, అందంగా, సుకుమారంగా, లావణ్యంగా ఉండే నాకోసం ఎందరో పరితపించేవారు. వారందరిలోకీ మీరు అందమైనవారు, తెలివైనవారు. నావైపు కన్నెత్తి చూసేవారుకారు. మీ నిరసన భావమేనన్ను మీ వైపు మొగ్గేలా చేసింది. నేనెన్ని వేషాలేసినా మిమ్మల్ని ఆకర్షించలేక పోయేదాన్ని. మీకు గర్వమని, అందంగా ఉన్నాననే అహంకారమని అపోహపడ్డాను.

మీ పొగరు అణగ ద్రొక్కాలని, నాకో ప్రేమలేఖ మీరు రాసినట్లు రాసి నా ఎడ్రస్సుకి పోస్టు చేసుకున్నాను. అదిచూపి మిమ్మల్ని అందరిలోనూ అవమానంపాలు చేశాను. కానీ తిరిగి

---

మొదటి బహుమతి రూ. 50

ఎ. వి. కె. శర్మ,

[ఎమ్. ఏ. (క్లాసు), సోషల్ వర్క్ డిపార్టుమెంట్, ఆర్ట్సు కాలేజీ, వాల్తేరు.]

పల్లెత్తుమాటన్నారా మీరు? దూషించారా? లేదే. ఎందుకూరుకున్నారు శర్మా? అనాడే తగిన శిక్ష విధించవలసింది. తప్పు చేయకపోయినా చేసినట్లు ఊరుకున్నారు. ప్రిన్సిపాల్ మిమ్మల్ని డిబార్ చేశారు. అనాటి నుంచినేనుపడిన బాధ వర్ణనాతీతం. అనుక్షణం మీరూపే కళ్ళముందు మెదిలేది. మీకు ద్రోహం చేశానని....

అదిగులు, బాధతో మంచం పట్టాను. మీకుచేసిన అన్యాయానికి భగవంతుడే నాకుశిక్ష విధించాడేమో- ఎంత అందంగా వుండేదాన్నని మురిసి పోయానో, ఎంత సుకుమారినని పొంగిపోయానో, మసూచికం పడి లేచేసరికి మారి పోయాను. చిత్రవధని అనుభవించాను శర్మా! నా తల్లితండ్రుల సంతోషం కోసం పెళ్ళి చేసుకున్నాను. కాపురాని కెళ్ళిన తరువాత తెలిసింది. ఆయన అసలు రూపం- ఆయనకులేని దురల వాటంటూ లేదు.

తెచ్చిన, డబ్బంతా, పేకాటకి పోసే వారు. తాగివచ్చి నన్ను చితకబాదేవారు. అలాంటప్పుడు మీ జ్ఞాపకాలు మనసుని పలకరిస్తూ వుంటే సంతోషంతో భరించే దాన్ని. రెండు సంవత్సరాలు చితగ్గొట్టి వదిలేశారు ఈ శరీరాన్ని. ఇక నాకు జీవించాలనే ఆశలేదు. కానీ ఒక్క- కోరిక మిగిలిపోయింది. కడసారిగా మిమ్మల్ని చూసి శాశ్వతంగా ఈ లోకాన్ని వదిలేస్తాను. అందుకే బయలు దేరి వస్తున్నా. ఈ అభాగ్యురాలికి దర్శన మిస్తారా శర్మా?

ఇట్లు,
కస్తూరి.

ఎవరీ కస్తూరి?? అర్థంకాక కవరు మీద ఎడ్రస్ చూశాను.

ఎ. కె. శర్మ విశాఖ-4, వాల్తేరు ఆర్. యస్. అని వుంది.

వీధి, యింటి నెంబరులేని? ఎవరి ఉత్తరమో నాకిచ్చేశాడు పోస్టుమన్.

ఎలాగైనా యిది ఆ వ్యక్తికి అందాలి. లేకుంటే ఒక నిండుప్రాణం బలై పోతుంది. ఆ వ్యక్తి ఆదరిస్తాడో? తృణీకరిస్తాడో?!

నేనైతే ఏం చేసేవాడిని???

ఆలోచిస్తూ వెనక్కి- తిరిగాను పోస్టుమన్ కోసం.

★★★

---

రైల్లో ఒక ఆసామీ మరొక ఆసామీతో :- "మిమ్మల్నింతకుముందు ఏదో వూళ్ళో చూసినట్టు గుర్తు."

రెండో ఆసామీ :- "చూసే వుంటారు. నేను చాలా కాలంగా ఏదో వూళ్ళో వుంటూనే వున్నానండి."